క్లుప్తంగా

కారుణ్య నియామకం



సాయిరాంకు నియామక పత్రం అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో టి.రంగస్వామి మరణించారు. ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మార్కెట్ యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ మృతుడు రంగస్వామి కుమారుడైన సాయిరాంకు కారుణ్య నియామకం కింద అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. రంగస్వామి సేవలు మరువలేనివని, ఆయన మరణం బాధాకరమని మార్కెట్‌యార్డు చైర్మన్ అన్నారు. కారుణ్య నియామకంపై ఆ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

26న కాపు, బలిజ కార్తీక వనభోజనం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రంగస్వామి

ఆదోనిటౌన్: ఈ నెల 26వ తేదీన ఆదోని పట్టణంలో కాపు, బలిజ సంఘీయుల కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం పట్టణాధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి మల్లికార్జున, గౌరవాధ్యక్షుడు భీమలింగప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాలులో వారు మాట్లాడుతూ.. ఆస్పరి రోడ్డులోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మండపంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కాపు, బలిజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

ఆదోనిరూరల్: కరువు కాటకాలతో పంటలు ఎండిపోయి అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పూనుకుంటున్నారని ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. గత గురువారం మండలంలోని అలసందగుర్తి గ్రామానికి చెందిన లద్దా సోమేష్ పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదోనిరూరల్: ఆదోని మండలం ఆరేకల్ గ్రామానికి చెందిన చంద్రన్న (25) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి శుక్రవారం విలేకరులకు తెలిపారు. చంద్రన్న కొత్త ఇల్లు కట్టుకొని అప్పులపాలయ్యాడని, అప్పులు ఇచ్చిన వారి బాధలు తట్టుకోలేక ఈనెల 21వ తేదీన ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు. బంధువులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య శ్యామలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాడి పశువులకు హెల్త్ కార్డులు



తుగ్గలిలో పశుపోషకులకు యానిమల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న డీడీ వెంకటరమణ

తుగ్గలి: ఆరోగ్య శ్రీ కార్డుల తరహాలో పశువులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులు అమలు చేస్తోందని పశుసంవర్ధక శాఖ ఆదోని డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలి పశు వైద్యశాలలో పశు పోషకులకు యానిమల్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. డీడీ మాట్లాడుతూ.. పశువులు, జీవాలు కలిగిన పశు పోషకులు యానిమల్ ఆరోగ్య కార్డులు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యం, ఆరోగ్య సంరక్షణ చర్యలు, కృత్రిమ గర్భధారణ, పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా ఆ వివరాలను కార్డులో నమోదు చేస్తారన్నారు. ఈ కార్డులపై బ్యాంకు రుణాలు కూడా పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఏడీ రవిప్రకాష్ రెడ్డి, పశు వైద్యాధికారిణి ప్రణీత పాల్గొన్నారు.



ఆదోని 9వ వార్డులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



బూదూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చిన్నతుంబళంలో ప్రగతి బోర్డును ప్రదర్శిస్తున్న దృశ్యం



బదినేహాల్‌లో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షేమ పాలనకు నిదర్శనం సీఎం జగన్

ఆదోనిటౌన్: 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, పట్టణ కన్వీనర్ మధుసూదనశర్మ అన్నారు. జగనన్నకే రాష్ట్ర ప్రజల మద్దతుతో పాటు ప్రధానంగా నారీలోకం జేజేలు పలుకుతుందన్నారు. శుక్రవారం పట్టణంలోని 1,9వ వార్డుల్లో వేర్వేరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పార్టీ జెండాలు, టోపీలు ధరించి జై జగన్ అంటూ నినాదాలు చేశారు.అభివృద్ధి డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేవా, మధుసూదన్‌శర్మ మాట్లాడారు. టీడీపీ, మాజీ సీఎం చంద్రబాబునాయుడిను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీ నాయకులు చేసే కుట్రలు, కుతంత్రాలతో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. వైఎస్ జగనన్న చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం, అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శలు చేశారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి కూడా చంద్రబాబు మోకాళ్లడ్డడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.జగనన్న ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక వచ్చే ఎన్నికల్లో తాము ఎక్కడ నామరూపాలు లేకుండా పోతామేమోనన్న భయంతోనే తోడేళ్లు గుంపుగా ఏర్పడి అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. జగనన్నను గెలిపించుకుని మరిన్ని పథకాలు అందుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆదోనిలో అభివృద్ధి జరగలేదని ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు రూ.475 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆయా వార్డుల ఇన్‌చార్జ్ సుధాకర్, సనాఖాన్‌ఇక్బాల్, నాయకులు, కార్యకర్తలు అరుణ్, ఉస్మాన్, రాముడు, ఇస్మాయిల్, మధు,కామప్ప, మమ్మత్తుస్వామి, నాగరాజ్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఆదోని వాల్మీకినగర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ శ్రేణులు

మంత్రాలయం: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మంత్రాలయం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రాలయం మండలంలోని బూదూరు గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో జక్కయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. అనంతరం సచివాలయ కార్యాలయంలో లబ్ధిదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందించిన సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, మోసపూరిత వాగ్దానాలిచ్చి జనాలను నిలువునా ముంచిన చంద్రబాబునాయుడు గత పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గత టీడీపీ పాలనలో టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ ముత్తమ్మ, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, మాజీ ఎంపీపీ రఘురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిచంద్రారెడ్డి, రాముడు, బొడ్డన్న, తంబళి వీరేష్, మల్లయ్య పాల్గొన్నారు.

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ సంబరంగా నిండిందని, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బదినేహాల్ సర్పంచ్ నరసప్ప, సీనియర్ నాయకుడు వీరభద్ర గౌడ్, సచివాలయ మండల కన్వీనర్ వెంకటరామి రెడ్డి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం శుక్రవారం ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన బదినేహాల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంత మంది లబ్ధి పొందారో తెలుపుతూ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబానికి ఎన్ని సంక్షేమ పథకాలు అందాయో వివరించడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి గురించి తెలియజేసి వారిని చైతన్యం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌వాహీద్, మండల కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి చెందారని జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండలంలోని అగసనూరు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామంలో నాయకులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కార్యాలయంకు వరకు ర్యాలీ వెళ్లి సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత చంద్రబాబు నాయుడు పరిపాలన తీరు, ప్రస్తుత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ అమలు తీరును వివరించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటే మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, ఎంపీటీసీ ప్రహ్లాద, భీమన్న, నాగేష్, కర్రెప్ప, నాగేంద్ర, తాయన్న, భీమేష్, విశ్వనాథ్, నాగరాజు, సిద్దప్ప, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



అగసనూరులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న మురళీమోహన్ రెడ్డి

గడప గడపలో సంక్షేమ వెలుగులు

ఆదోనిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు దరిచేరుతున్నాయని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులుకు చెందిన 8వ వార్డులో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌తో కలిసి మనోజ్‌కుమార్‌రెడ్డి గడప గడపను సందర్శించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకుసాగారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి చేసిన మేలు, వార్డుల అభివృద్ధిని వివరించారు. ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగనన్న ప్రజలకు ఇచ్చిన మాట మేరకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి 99.5 శాతం హామీలను పరిష్కరించి ఉత్తమ పరిపాలనదక్షుడిగా పేరుపొందాడన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, జగనన్న ఆసరా, జగనన్న చేయూత తదితర పథకాలను చేపట్టి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని వివరించారు.



ఆదోని 8వ వార్డులో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

2024లో జరిగే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు మళ్లీ జగనన్నకేనని పేర్కొన్నారు. ఆదోని నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసిన ఘనత సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికే దక్కిందని వివరించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైస్ చైర్మన్ గౌస్, కౌన్సిలర్లు అశోక్, ఫయాజ్, సురేష్, రఘునాథ్‌రెడ్డి, బాలాజీ, నాయకులు యేసేబు, నాగరాజ్, తాయన్న, బ్రహ్మయ్య, మహిళా విభాగం జిల్లా నాయకురాలు శ్రీలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాల తనిఖీ

ఆదోనిఅర్బన్: పట్టణంలోని మెడికల్ దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొన్ని దుకాణాల్లో గడువు ముగిసిన మందులు విక్రయించడం, ఫార్మసిస్టు లేకుండా మందుల విక్రయం, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌ను రిజిస్టర్‌లలో నమోదు చేయకుండా మందులిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకున్నారు. ఇందులో దీపక్ ఫార్మసీ, దీపక్ డ్రగ్‌హౌస్, అపోలో ఫార్మసీ, న్యూ సురేష్ మెడికల్స్, సతీష్ మెడికల్ సెంటర్, న్యూ శారదా మెడికల్ స్టోర్, ప్రవీణ్ మెడికల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ...మెడికల్ షాపులు నిబంధనలు అతిక్రమిస్తే సమాచారం అందించాలని, అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచి, షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం తనిఖీల్లో ఏడు దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, హరిహరతేజ, సవ్యనాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఆదోనిలో మెడికల్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

క్రీడా పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

ఆదోని సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి రన్నరప్‌గా నిలిచారని అక్షరశ్రీ పాఠశాల కరెస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఫుట్‌బాల్ క్రీడలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి సెకండ్ ప్లేస్‌లో నిలిచారని తెలిపారు. క్రీడలతో పాటు చదువులో కూడా ప్రతిభను చాటాలన్నారు. పాఠశాల ఫౌండర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ మేఘనాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నేషనల్ లెవల్ అండర్-14 విభాగంలో జరిగే క్రీడా పోటీలకు చైతన్యశ్రీ ఎంపికైనట్లు అక్షరశ్రీ పాఠశాల డైరెక్టర్ మేఘనాథ రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ క్రీడలో చైతన్యశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. త్వరలో నేషనల్ లెవల్‌లో జరిగే క్రీడా పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణిని ప్రత్యేకంగా అభినందించారు.

కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.లక్ష విలువైన కిరాణం సరుకులు కాలి బూడిదయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అమరయ్య స్వామి తన నివాసంలో కిరాణం సరుకులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కార్తీక మాసం కావడంతో సాయంత్రం ఇంట్లో దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం పనిలో నిమగ్నమై ఉండగా దీపాల మంటలు పక్కనున్న ప్లాస్టిక్ సీసాలకు అంటుకుని ఒక్కసారిగా దుకాణంలో మంటలు వ్యాపించాయి. ఇరుగుపొరుగు వారు మంటలను అదుపుచేసేలోగా కిరాణ సరుకులకు అంటుకున్నాయి. వెంటనే ఆదోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.



అగ్ని ప్రమాదంపై విచారణ చేస్తున్న ఎస్‌ఐ

కోలుకోలేక విద్యార్థిని మృతి

తుగ్గలి: కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు ప్రయతి్నంచిన విద్యార్థిని కోలుకోలేక మృతి చెందింది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాతనకు చెందిన బీమరాజు మూడవ కూతురు శ్రావణి (20) పత్తికొండ ప్రతిభ కాలేజీలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లుగా శ్రావణి కడుపు నొప్పితో బాధపడుతుండేది. నొప్పి తీవ్రం కావడంతో విరక్తి చెంది ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కడమకుంట్లలో డెంగీ కేసు నమోదు

తుగ్గలి: మండల పరిధిలోని కడమకుంట్లలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు నాలుగు రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు మొదట అనంతపురం తీసుకెళ్లారు. తిరిగి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో డెంగీ పాజిటివ్‌గా తేలింది. దీంతో శుక్రవారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కడమకుంట్లలో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన వీరబ్రహ్మేంద్ర దేవాలయంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వీరంపల్లి సంజీవయ్య ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణోత్సవానికి దాతలు పారా విశ్వనాథ్ తాళిబొట్టు, రూ.5 వేలు అలాగే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి రూ.5 వేలు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు వేసి భక్తిని చాటుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కాలజ్ఞానం వినిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అక్రమ లేఅవుట్‌పై చర్యలు



జేసీబీతో హద్దు రాళ్లను తొలగిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని వైఎంకే స్కూల్ వద్ద కొందరు అనధికారికంగా లేఅవుట్ వేశారు. దీనిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం గుర్తించి లేఅవుట్ ప్లాట్ రాళ్లను సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌డ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలు అనధికారిక ప్లాట్లు కొనవద్దని సూచించారు. అనుమతులు లేని లేఅవుట్‌లో ప్లాట్లను కొంటే విద్యుత్, తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు మున్సిపాలిటీ ద్వారా ఇతర సౌకర్యాలు కల్పించబడవని స్పష్టం చేశారు.

నైపుణ్యం గల డ్రైవర్లను నియమించుకోవాలి

పెద్దకడబూరు: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను పాఠశాలలకు తరలించే వాహనాలకు అర్హత, నైపుణ్యం, అనుభవం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని ఎస్‌ఐ మహేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, డ్రైవర్లతో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిల్లల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల కండీషన్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటివి అప్‌డేట్‌గా ఉండాలన్నారు. డ్రైవర్లు మద్యం తాగడం, అతి వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాలకు కారకులైతే వారితో పాటు యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్

ప్రారంభానికి సిద్ధం

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో ప్రజల ముంగిటనే సేవలు అందించాలన్న లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తెచ్చింది. సచివాయంలో వివిధ శాఖలకు చెందిన పదకొండు మంది ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి గ్రామంలో సచివాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలన్న లక్ష్యంతో నిధులు మంజూరుచేసి శరవేగంగా పూర్తి చేస్తోంది. ఈ మేరకు ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాలు శరవేగంగా నిర్మితమవుతున్నారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో సచివాలయ భవనాన్ని రూ.40 లక్షలతో నిర్మించారు. ఈ భవనం పూర్తి కావడంతో త్వరలోనే ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



ఎరిగేరి గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం

భజన పోటీల విజేత లక్ష్మిపల్లి

ఆస్పరి: మండలంలోని అట్టికల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత (అంగయ్యస్) 13వ ఆరాధనోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం లక్ష్మిపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టుకు మొదటి బహుమతిగా రూ.12,600ను శుక్రవారం ఆలయ నిర్వాహకులు, దాతలు అందజేశారు. అలాగే రెండవ బహుమతి గుత్తి ఆర్‌ఎస్ జట్టుకు రూ. 9,999, తర్వాతి స్థానాల్లో నిలిచిన ఆలంకొండ జట్టుకు రూ.8,100, దొడగొండ జట్టుకు రూ.7,200 తురువగల్లు జట్టుకు రూ.6,300, హలిగేర బృందానికి రూ.5,400, ఐనకల్లు జట్టుకు రూ.4,500, ముత్తుకూరు జట్టుకు రూ.3,600, బనవనూరు జట్టుకు రూ.2,700, పదో బహుమతి యనకండ్ల బృందానికి రూ.1,800 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఉత్తమ హార్మోనిష్టుగా లక్ష్మిపల్లి సుదర్శన్ ఆచారి, ఉత్తమ తబలిస్టుగా గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన వెంకటేష్, ఉత్తమ గాయకుడిగా అలంకొండ చిదంబరరెడ్డి ఎంపికయ్యారు. వీరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేంద్ర శుక్రవారం తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో నంద్యాల జిల్లా మిడుతూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న హరికృష్ణ, 8వ తరగతి చదువుతున్న రూప ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు జనవరిలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. క్రీడాకారులను హెచ్‌ఎం నిస్సార్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.